# పొగ

రిక్షావాలా బయలు దేరబోతున్న బస్సుకు అడ్డంగా రిక్షా నిలిపాడు. హడావిడిగా రిక్షా దిగింది ప్రియ. అతనికి థ్యాంక్స్ చెప్పి డబ్బులిచ్చి పంపించేసింది.

ఇంకా నయం ఈ బస్సు మిస్సయింది కాదు - అయ్యుంటే ఆఫీసుకు అరగంట ఆలస్యం అయ్యేది.

"వచ్చేవాళ్ళు కొంచెం ముందు రాకూడదా?" కండక్టర్ విసుగ్గా అన్నాడు టిక్కెట్టు కొడుతూ.

ఆమె రెగ్యులర్ ప్యాసింజర్. 'సి' క్యాంపు సెంటర్లో బస్సు ఎక్కి నందికొట్కూరు పోయి తిరిగి సాయంత్రానికి కర్నూలుకు చేరుకుంటుంది. ఈ మధ్యనే ఆమెకు బ్యాంకులో ఉద్యోగం దొరికింది. రోజూ వెళ్ళి వస్తున్నది-ఆ ఊళ్లోకి కాపురం మార్చలేక.

"వచ్చేదాన్నే - రిక్షా ఛెయిన్‌పడి ఆలస్యమైంది" సంజాయిషీ యిచ్చింది.

సీటుకోసం చుట్టూ చూసింది. ఎక్కడా ఖాళీ లేదు. ఇంకా యిద్దరు ఆడవాళ్ళు పిల్లలతో నుల్చుని ఉన్నారు బస్సులోపల.

బస్సు బయలుదేరింది. కుదుపుకు ప్రియ కండక్టర్ మీద పడబోయి తమాయించుకుంది.

"ఇది ఆడవాళ్ళకోసం రిజర్వు చేసిన సీటు" - ముందు వరుసలో కూర్చున్న యువకులను ఉద్దేశించి అంది. స్టూడెంట్స్‌లాగున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు నిర్లక్ష్యంగా.

"దీనిమీద రాసి ఉండొచ్చు - కానీ ఫస్టు కమ్ ఫస్టు సర్వుడ్-" ఎఱ్ఱ చొక్కా యువకుడు చెప్పాడు.

"ఇంక రిజర్వేషన్ ఫర్ లేడిస్ అన్నదానికి అర్థం ఏముంది. బస్సు యాజమాన్యం మా కోసం కొన్ని సీట్లు కేటాయిస్తే - వాటిని మీరు ఆక్రమిస్తే ఎలా?" ప్రియ చెప్పింది. "వాళ్ళు చూడండి - పిల్లల్ని చంకనెత్తుకొని నిల్చోనున్నారు - వాళ్ల కోసమన్నా మీరు యింకెక్కడైనా అడ్జస్టు చేసుకోండి."

"మరి మొగాళ్ళ సీట్లల్లో చాలామంది లేడీస్ కూర్చున్నారు. వాళ్ళని లేపుతారా?" పచ్చ చొక్కా కుర్రాడు నిలదీశాడు.

"చూడ మిష్టర్! మొగాళ్ళ సీట్లు అని ఎక్కడా రాసిలేదు. అవి జనరల్ సీట్లు -" కొరకొర చూస్తూ చెప్పింది. ఇంతలో కండక్టర్‌కి తన డ్యూటీ గుర్తుకొచ్చింది.

"దయచేసి మీరు సీట్లు ఖాళీ చేసి ఆడవాళ్ళకివ్వండి."

పచ్చచొక్కా యువకుడు కోపంగా ఏదో అనబోయాడు - కానీ అతన్ని మిగతా యిద్దరూ వారించి సీట్లు ఖాళీ చేసిచ్చారు.

"చల్లగుండాలమ్మా!" అంటూ పిల్లల తల్లులు ముందస్తు కూర్చున్నారు - "దామ్మా! నువ్వు కూడా కూర్చో." అంటూ కొంచెం సర్దుకుని సీటు చూపించారు.

ప్రియకు సరిపోక పోయినా - మొగాళ్ళ ముందు తనొక్కతే నిలబడటం బాగుండదని సర్దుకు కూర్చుంది.

యువకుల మొహాల్లో కొంచెం అవమాన భారం కనిపిస్తున్నది. వాళ్ళు ద్వారం దగ్గరే నిలబడ్డారు ఈమెని గమనిస్తూ.

ఇంతలో పచ్చచొక్కా ఓ సిగరేట్ వెలిగించుకుని - తన యిద్దరు మిత్రులకు తలొకటి ఆఫర్ చేసింది. ముగ్గురు రైలింజన్ లాగా పొగవదలడం మొదలెట్టారు. డోర్ విండో తెరిచి వుండటం మూలాన రివ్వున వీచే గాలికి వాళ్ళు వదలిన పొగ ప్రియను తాకుతున్నది.

"ప్లీజ్ డోంట్ స్మోక్!" రిక్వెస్టు చేసింది దగ్గుతూ.

పచ్చచొక్కా ముందుగా రియాక్టయింది.

"సారీ! మేమేం మీ సీట్లో కూర్చుని సిగరెట్టు తాగడం లేదే - మమ్మల్ని తాగొద్దని చెప్పాడానికి."

మిగతా రెండు చొక్కాలు నవ్వాయి.

"అందుకే పొగతాగొద్దని అడుగుతున్నాను" కోపంగా చెప్పింది ప్రియ.

"ఆ మాట అడగడానికి మీరెవరు?" ఎఱ్ఱ చొక్కా కల్పించుకుంది.

ఈ సంభాషణని తోటి ప్యాసింజర్లు ఆసక్తితో గమనిస్తున్నారు. ప్రయాణమంటేనే బోరు! దాంలో యిటువంటి టిక్కెట్టులేని వినోదాలొస్తే చూడ్డానికి ఎవరు వెనుకంజ వేస్తారు?

"చూడు మిస్టర్ - నా కు స్మోకింగ్ పడదు. తల తిరుగుతుంది ఆ వాసనకు." తన బలహీనత చెప్పింది.

ఆ ముగ్గురూ ఆనందంగా నవ్వారు.

"బస్సు ఎక్కిం దగ్గర్నుంచి తల తిరుగుతూనే వుంది." ఇంతవరకూ మాట్లాడని నీలం చొక్కా వ్యాఖ్యానం చేసింది.

మళ్ళీ నవ్వులు - కోరస్ కూడ బస్సులో వినిపించాయి.

"నాన్సెన్స్! అస్సలు బస్సులో పొగతాగరాదు. ఏం కండక్టర్ - చెప్పవేం?" గద్దించింది.

కండక్టర్ వణికిపోయాడు - అసలే బక్కప్రాణి.

"అయ్యా! బస్సులో పొగ నిషేధించడమైంది - తమరు తాగొద్దు?"

"ఏది ఆ మాట ఎక్కడుంది?"

"ఎక్కడా రాసిలేదే?"

"ఇందాక రాసి వుందని కదూ - మా సీటు ఖాళీ చేయించావు - ఇది రాసిలేదు - అందుకని పొగ తాగడం మా జన్మహక్కు." పచ్చచొక్కా ఖరాఖండిగా చెప్పేసింది.

కండక్టర్ వణుక్కుంటూ ప్రియ దగ్గరకి వచ్చాడు.

"అమ్మా! మీరు చివరికి వెళ్ళండి. అక్కడున్న పాపను యిక్కడ కూర్చోబెడతాను." రాజీ ధోరణిలో సర్ది చెప్పబోయాడు.

"ఊరుకోవయ్యా - ఇది కేవలం నా సమస్య కాదు." కసురుకుని సీట్లోంచి లేచి డ్రైవర్ దగ్గరికి వెళ్ళింది.

"డ్రైవర్ బస్సు ఆపు"

"నెక్ట్స్ స్టేజీలో ఆపుతాను."

"నో. ఇక్కడే ఆపు!" కటువుగా అంది.

డ్రైవర్ తన కెందుకొచ్చిన గొడవని బస్సు ఆపాడు.

"దిగండయ్యా! ముందు మీరు బస్సు దిగండి." హుంకరించింది ప్రియ యువకులను ఉద్దేశించి -

"ఎందుగు దిగాలి? టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నామా? ఇదిగో టిక్కెట్టు" ఎఱ్ఱ చొక్కాతను చూపించాడు టిక్కెట్టు బయటకుతీసి.

"టిక్కెట్టు కొనడం ఒక్కటే అర్హత కాదు - బస్సులో ప్రయాణం చేయడానికి బస్సులో కనీసం మర్యాదలు - సాంప్రదాయాలు పాటించాలి." ప్రియ కొంగు బిగించి చెప్పింది.

"బస్సు నీ బాబు సొమ్మా?" నీలం చొక్కా అడిగింది.

"ఆమె మొగుడిదేమో!" పచ్చచొక్కా అంది.

"షటప్! ఇక్కడ బస్సు ఎవరిది అన్నది కాదు ప్రశ్న. బస్సులో ఎందరు ఉన్నారు అన్నది ముఖ్యం. పిన్నలు పెద్దలు - ఆడాళ్ళు - చంటిపిల్లలు - యింతమంది ఉన్నారు - మీ స్మోకింగ్ వాళ్ళందర్నీ నాశనం చేస్తున్నది."

"జాగ్రత్తగా మాట్లాడు. పొగ తాగడం నేరంకాదు." ఎఱ్ఱ చొక్కా అంది.

"బహుశ - బయట, కానీ - యిక్కడ కాదు. ముందు మీరు బస్సు దిగండి. అలా చూస్తారేమయ్యా - బయటకు దింపండి." అక్కడున్న మొగాళ్ళను ఉద్దేశించి అన్నది.

"దీని పొగరు చూస్తూ ఉంటే మరీ మితి మీరుతున్నది. ఓపట్టు పడదామా?" పచ్చ చొక్కా అతను అన్నాడు.

"అది యిది అని వాగావంటే పళ్ళు రాల్తాయి." చెప్పు చేతిలోకి తీసుకుంటూ అంది భద్రకాళిలా.

"మమ్మల్ని బస్సు దిగమని చెప్పే హక్కు ఎవరిచ్చారు?" నీలం చొక్కా తగ్గి అడిగింది.

"సిగరెట్ ప్యాకెట్టుంది చూశారూ - దానిమీద చట్ట ప్రకటన ఉంది - చూశారా? అది చూసి ఉండరు. పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం అని వుంటుంది."

ప్రియ మాటలు విని ఎర్ర చొక్కా ప్యాకెట్టుతీసి చూసింది.

"అయిందా - మీ పుణ్యమాని ఈ బస్సులో మీ ముగ్గురేకాదు - పొగ తాగుతున్నది...." ప్రియ ఆగింది ఊపిరి తీసుకోవడానికి.

"మరి యింకెవరున్నారు?" కండక్టర్ తను చూడనందుకు ఆశ్చర్యపోయాడు.

"ఈ బస్సులో ఉన్నావాళ్ళంతా! మీరొదిలిన పొగ మా ముక్కుల్లోంచి, మా ఊపిరితిత్తుల్లోకి పోయి మా ఆయుర్దాయాన్ని తగ్గించేస్తున్నది. ఏ పాపం ఎరుగని ముక్కుపచ్చలారని ఈ పసిబిడ్డలు కూడా పొగ పీల్చుకోవాల్సివస్తున్నది." ప్రియ వివరించింది. "పాసివ్ స్మోకింగ్ ఈజ్ మోర్ డేంజర్."

"ఇంకా చూస్తారేం - దిగండి." కోపంగా అరిచారుకొందరు పెద్ద మనుషుల్లాగున్న ప్రయాణికులు.

ఖంగుతిని మూడు చొక్కాలు దిగాయి. బస్సు వాళ్ళమొహాన దుమ్ముకొట్టుతూ బయలుదేరింది.

**( కలువబాల మార్చి 1-5-90 )**